"ఇతర విషయాలు ఆలోచించలేదు నానమ్మా! పక్కింటి రాము ఆటవస్తువులన్నీ నేను దాచేసాను. అది గుర్తు రావడంతో మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళి వాటిని యధాస్థానంలో పెట్టేసి వస్తున్నాను." జవాబు చెప్పాడు మనవడు.

మనం చేసే ప్రార్ధనలు కూడా ఇలాంటి ఫలితాలని ఇస్తూంటేనే మనం సరైన ప్రార్ధనని చేసినట్లు.

## 122. జ్ఞాపకార్ధం

ఏక్సిడెంట్‌లో మరణించిన తన కొడుకు జ్ఞాపకార్ధం, ఒకతను కాశీలో కట్టే ఓ సత్రంలోని ఓ గదికి పెద్ద మొత్తాన్ని చందాగా ఇచ్చాడు. అక్కడున్న ఓ యువతి వెంటనే తన భర్తతో గొంతు తగ్గించి చెప్పింది.

"మనం కూడా మన అబ్బాయి జ్ఞాపకార్ధం అంతే మొత్తం ఇద్దాం."

"నీ కేమైనా మతి పోయిందా? మన కొడుకు బ్రతికే ఉన్నాడుగా?" చిరుకోపంగా చెప్పాడు భర్త.

"అందుకనే. మనకా గర్భ శోకం ఇవ్వనందుకు కాశీ విశ్వనాథుడికి కృతజ్ఞతగా ఓ గదిని కట్టిద్దాం." చెప్పిందా తల్లి.

## 123. ఆనందం మీ వెంటే

ఓ పిల్లి తన తోకని అందుకోవాలని విశ్వప్రయత్నం చేయసాగింది. కాని అది దానికి సాధ్యం కాలేదు. ఇంకో పిల్లి వచ్చి దాన్ని చూసి అడిగింది.

"ఏం చేస్తున్నావు?"

"నా తోకని అందుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను."

"ఎందుకు?"

"అందువల్ల నాకు ఆనందం లభిస్తుంది కాబట్టి."

"ఒకప్పుడు నేను కూడా నీలాగే నా తోకలో ఆనందం వుందని భావించి దాన్ని అందుకోడానికి ప్రయత్నించాను. అది నావల్ల కాలేదు.

కొంతకాలానికి నాకు అర్థమైంది, నా తోక ఎప్పుడూ నాతో వుంటూ, నేను ఎక్కడికి వెళ్ళినా అది నన్ను అనుసరిస్తూంటుందని. ఈ రహస్యం తెలీగానే నేను దాన్ని అందుకునే ప్రయత్నం మానేసాను."

వేదం, ఉపనిషత్తులు, గురువులు బోధించే సత్యం ఇదే. మనం ఆనందం కోసం ప్రపంచంలోని అనేక వస్తువులు, మనుష్యులు, పరిస్థితులు వెంట పరిగెడుతూన్నంత కాలం నిజమైన ఆనందాన్ని మనం అందుకోలేం. ఆనందం అనేది మనలోనే సదా, శాశ్వతంగా, అపరిమితంగా వుందని గ్రహించాక దానికోసం వెంపర్లాడక్కర్లేదు. మనకి ఆత్మదర్శనం అవగానే పై సత్యం అనుభవంలోకి వస్తుంది.

## 124. రెండు నాలుకలు

రబియా అనే పారశీక భక్తురాలు ఓ అలవికాని జబ్బుతో బాధపడసాగింది. ఒకరు ఆమెని అడిగారు.

"అమ్మా! ఆధ్యాత్మికంగా నువ్వు గొప్ప స్థితిలో ఉన్నావు. నీ రోగాన్ని నయం చేయమని నువ్వు దేవుణ్ని ప్రార్థిస్తే అల్లా కాదనలేడు కదా?"

"అలా ప్రార్థించడానికి నాకు రెండు నాలుకలు వుంటేగా?" జవాబు చెప్పింది రబియా.

"అంటే?" అర్థం కాక అడిగాడు అతను.

"నేనెప్పుడూ అల్లాని, 'జరిగేదంతా నీ ఇచ్ఛ ప్రకారం జరుగుగాక' అని ప్రార్థిస్తూంటాను. నా జబ్బు భగవంతుని ఇచ్ఛ తోనే వచ్చాక, దానిని తొలగించమని ప్రార్థించడానికి నాకు రెండో నాలుక ఉంటేగా?" జవాబు చెప్పిందామె.

సత్పురుషులకి తమ కష్టాలని భగవంతుడే స్వయంగా కల్గించాడని తెలుసు కాబట్టి, వాటిని తొలగించమని ప్రార్థించరు. ఎందుకంటే వారు భగవంతుడి ఇచ్ఛే తమ ఇచ్ఛ అనుకొంటూ జీవిస్తారు.